పథకాలు అర్హులందరికీ అందాలి

• జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత • జగిత్యాల రూరల్ మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాలరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండల సర్వసభ్య సమావేశం ఇన్‌చార్జి ఎంపీపీ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఉపాధిహామీ పథకం కింద చేసిన పనులకు బిల్లులు రావడం లేదని సర్పంచ్‌లు తిరుపతి, చెరుకు జాన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పనులు పురోగతిలో ఉండగా, కొన్ని పూర్తయినట్లు చూపించడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఏఈ రాజమల్లయ్య తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులుండగా టీచర్లను డిప్యూటేషన్‌పై పంపించడం సరికాదని గుల్లపేట సర్పంచ్ తిరుపతి అన్నారు. అంతర్గాంలోని రెండు ప్రాథమిక పాఠశాలలను ఒకే చోట నిర్వహించాలని ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్ కోరారు. ఎంఈవో గాయత్రి మాట్లాడుతూ.. గుల్లపేట ప్రాథమిక పాఠశాల టీచర్లు సెలవులో వెళ్లడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, సమస్య పరిష్కరిస్తామన్నారు. అంతర్గాం పాఠశాలలో పూర్తిస్థాయి ఉపాధ్యాయులతో బోధన చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. తూములు, కాల్వలకు మరమ్మతు చేయడం లేదని మోరపల్లి ఎంపీటీసీ సభ్యుడు భూంరెడ్డి, కన్నాపూర్ సర్పంచ్ సుధాకర్ తెలిపారు. బ్యాంకుల్లో రుణం తీసుకుని మృతిచెందిన వారి మరణ ధ్రువీకరణ పత్రంతోపాటు, కుటుంబ సభ్యుల సర్టిఫికెట్లను బ్యాంకర్లు అడుగుతున్నారని హబ్సీపూర్ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. దరఖాస్తు చేసుకుంటే ఇస్తామని తహసీల్దార్ రామ్మోహన్ పేర్కొన్నారు. అభివృద్ధి పనుల బిల్లులు రావడం లేదని కన్నాపూర్ సర్పంచ్ సుధాకర్ అన్నారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని జెడ్పీ చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ నిరుపేదల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. ఎంపీడీవో రాజేశ్వరి, సూపరింటెండెంట్ గంగాధర్, అధికారులు పాల్గొన్నారు.

స్పైసీ యూనిట్‌పై ప్రశ్నలు

• నోరెత్తని అధికారులు • మేడిపల్లి మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ఖయ్యూం

మేడిపల్లి: దేశాయిపేటలో దళితబంధు కింద ఏర్పాటు చేయతలపెట్టిన స్పైసీ యూనిట్‌పై ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నించగా అధికారులు నోరెత్తలేదు. బుధవారం మేడిపల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ దొనకొంటి ఉమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. మేడిపల్లి జెడ్పీటీసీ సభ్యుడు, జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు గైర్హాజరవడం చర్చనీయాంశమైంది. పసునూరు సర్పంచ్ లచ్చానాయక్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రెండేళ్లుగా రావడం లేదన్నారు. అధికారులు ఏ సమాచారం అడిగినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పోరుమల్ల సర్పంచ్ తిరుపతిరెడ్డి ఆరోపించారు. మేడిపల్లి–గోవిందారం రోడ్డుకు కేంద్రం రూ.22 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పనులకు అడ్డంకులు సృష్టించినా పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఇది బీజేపీ వల్లే సాధ్యమైందన్నారు. కాంగ్రెస్ భీమారం మండల అధ్యక్షుడు, సర్పంచ్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, గోవిందారం సర్పంచ్ కరండ్ల మధుకర్ మాట్లాడుతూ.. స్పైసీ యూనిట్‌ను రూ.50 లక్షలతో ఏర్పాటు చేయవచ్చని ఎలా అంచనా వేశారని ప్రశ్నించారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించరా అన్నారు. ఈ వ్యవహారంలో మధ్యవర్తుల పాత్ర ఏంటని నిలదీశారు. క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించకుండా నిధులు ఎలా మంజూరు చేశారని మండిపడ్డారు. స్పందించిన ఎంపీడీవో సూపరింటెండెంట్ ఖయ్యూం సమస్యలన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే వద్దకు లబ్ధిదారులు..

స్పైసీ యూనిట్ లబ్ధిదారులు బుధవారం ఎమ్మెల్యే రమేశ్‌బాబును కలవడానికి వెళ్లినట్లు సమాచారం. ఐదుగురిలో నలుగురు హైదరాబాద్ వెళ్లారని తెలిసింది. వారికి ఎమ్మెల్యే నుంచి హామీ ఇప్పించే ప్రయత్నాలు చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

'గృహలక్ష్మి' విధివిధానాలు ఏమిటి?

• లబ్ధిదారుల ఎంపికపై సమాచారం లేదు • బీర్‌పూర్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు



మాట్లాడుతున్న ఎంపీపీ రమేశ్

సారంగాపూర్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన గృహలక్ష్మి పథకం విధివిధానాలు ఏమిటో తమకు తెలియవని, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో కనీస సమాచారం లేదని బీర్‌పూర్ మండల ప్రజాప్రతినిధులు పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఎంపీపీ మసర్తి రమేశ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కొల్వాయి ఎంపీటీసీ సభ్యుడు రంగు లక్ష్మణ్ మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఎలా జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. లబ్ధిదారుల ఎంపికలో అర్హత ఉన్న పేదవారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వైస్‌ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, తుంగూర్ ఎంపీటీసీ సభ్యురాలు ఆడెపు మల్లీశ్వరి మాట్లాడుతూ.. లబ్ధిదారుల ఎంపికపై తమకు కనీస సమాచారం ఇవ్వలేదన్నారు. తాను లబ్ధిదారుల జాబితాను ఓ పార్టీ కార్యకర్త నుంచి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఓ అధికారి ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవో రాజేందర్ స్పందిస్తూ.. సమాచారం లేకపోవడంతో పొరపాటు జరిగిందని, ఇక నుంచి ఇలా జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కొల్వాయి సింగిల్‌విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు మాట్లాడుతూ.. ఎంఈవో భీమయ్యకు పలు మండలాల ఎంఈవో బాధ్యతలు అప్పగించడం సరికాదన్నారు. ధర్మపురి మండల కేంద్రం నుంచి బీర్‌పూర్ మండలానికి ఆర్టీసీ బస్సును నడిపించాలని కోరారు. బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల్లో వైద్యప్రగతి కింద ఇచ్చిన మందులు, ఇతర వివరాలు ఒకేలా ఉండటంతో ఎంపీడీవో సంబంధిత అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్లు సమ్మెలో ఉంటే వారి వద్ద నుంచి తాళాలు తీసుకొని, కేంద్రాలను నడిపించాల్సి ఉన్నా ఎందుకు నిర్లక్ష్యం చేశారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లను ప్రశ్నించారు. తహసీల్దార్ విజయలలిత, సర్పంచ్ పర్వతం రమేశ్, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్ మండల, బ్లాక్ అధ్యక్షుల నియామకం



నాగరాజు



ఎండీ.అజీమ్


కథలాపూర్: కాంగ్రెస్ పార్టీ, బ్లాక్ కాంగ్రెస్ కథలాపూర్ మండల అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దూలూర్‌కు చెందిన ఎండీ.అజీమ్‌ను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, దుంపేటకు చెందిన కాయితి నాగరాజును పార్టీ మండల అధ్యక్షుడిగా రెండో సారి నియమించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున మండలంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని సూచించారు.

విద్యుత్ ఏఈకి సన్మానం




మల్యాల: స్థానిక విద్యుత్ ఏఈ కొమ్ము కమలేశ్వర్ సైదాపూర్ మండలానికి బదిలీ కాగా, బుధవారం స్థానిక సబ్‌స్టేషన్‌లో సన్మానించారు. ఏడీఈ సీహెచ్.బాలలింగం, రామన్నపేట సెక్షన్ ఏఈఈ వి.శ్రీనివాస్, కొడిమ్యాల ఏఈఈ ఆర్.రఘునాథ్, పూడూరు ఏఈఈ శ్రీనాథ్ తదితరులు ఆయనను శాలువాతో సత్కరించారు. కమలేశ్వర్ తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించారని కొనియాడారు. సబ్ ఇంజినీర్లు గంగరాజు, అభినయ్, మధుకర్‌రెడ్డి, జగదీశ్, సిబ్బంది కావ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌కు..



మల్యాల: ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా ప్రశంసాపత్రం అందుకున్న మల్యాల మండల కేంద్రానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ సీహెచ్.స్వప్నను బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సన్మానించారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్ ఆమెను శాలువాతో సత్కరించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి దాసరి రవీందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆసం శివకుమార్, అంగన్‌వాడీ టీచర్లు, వార్డు సభ్యులు రచన, వజ్రవ్వ తదితరులు పాల్గొన్నారు.

రూ.18 వేల వేతనం ఇవ్వాలి



ధర్మపురి: తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ధర్మపురి మండలంలోని ఆశవర్కర్లు బుధవారం తహసీల్దార్ కృష్ణ చైతన్యకు వినతిపత్రం అందించారు. ఏళ్లుగా తక్కువ వేతనంతో ఎక్కువ పని చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని విన్నవించారు. జయ, జ్యోతి, వనిత, పద్మ, స్వప్న తదితరులున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం



పరిశీలిస్తున్న చైర్మన్ హన్మాండ్లు

రాయికల్: 10వ వార్డులో మారంపల్లి బాజయ్య ఇంట్లో బుధవారం షార్ట్‌సర్క్యూట్‌తో టీవీ, కూలర్ ఇతర వస్తువులు దగ్ధమైనట్లు బాధితుడు తెలిపాడు. మున్సిపల్ చైర్మన్ హన్మాండ్లు ఘటనాస్థలికి వెళ్లి, పరిశీలించారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

సీఎం సహాయనిధిని వినియోగించుకోవాలి

• ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



చెక్కులు ఇస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: సీఎం సహాయనిధిని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల పట్టణానికి చెందిన 150 మందికి రూ.1.50 కోట్ల విలువైన చెక్కులను తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. చాలామంది సీఎం సహాయనిధి ద్వారా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఇది ఒక అద్భుతమైన పథకమని, అర్హులందరూ వినియోగించుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మల్లేశం, నాయకులు రాజ్‌కుమార్, రాజేందర్‌రావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

ప్రభుత్వం దివ్యాంగులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల మినీస్టేడియంలో జగిత్యాల నియోజకవర్గ దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిళ్లు అందజేశారు. ప్రభుత్వం దివ్యాంగులకు పెన్షన్ డబ్బులను సైతం పెంచిందని, సీఎం కేసీఆర్ వారి సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ వసంత, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, డీడబ్ల్యూవో నరేశ్ తదితరులున్నారు.

సంక్షేమ పథకాలతో భరోసా

సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలతో పేద ప్రజలకు భరోసా కల్పించారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయన మాట్లాడుతూ.. జగిత్యాలలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగిందని, మెడికల్ కళాశాల, జిల్లా కేంద్రం ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. బీజేపీ అంటే భారతీయ జూటా పార్టీ అని ఎద్దేవా చేశారు. నాయకులు ఆనందరావు, రాజేశ్, రవి, వేణు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ బాపురెడ్డి



కిష్టంపేటలో పూజలు చేస్తున్న శ్రావణి

కథలాపూర్: దుంపేట, భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లో గణనాథుని మండపాల వద్ద బుధవారం భక్తులు, నిర్వాహకులు ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కొండ ఆంజనేయులు, సర్పంచ్ అంబటి లత, నాయకులు మహేందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: కిష్టంపేట గ్రామంలో భజరంగ్‌దళ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. నాయకులు ఆడెపు సురేశ్, రాజశేఖర్, విష్ణువర్ధన్, రమేశ్, విజయ్, ధీరజ్ పాల్గొన్నారు.

మల్లాపూర్: కొత్తదాంరాజుపల్లిలో రాపుల్స్ యూత్ గణేశుని మండపం వద్ద బుధవారం అన్నదానం చేశారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ సరోజన, సర్పంచ్ సరిత, ఉపసర్పంచ్ లత హాజరై, గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన పన్నాల నారాయణరెడ్డి–పద్మ దంపతులు అందించిన విరాళంతో అన్నదానం చేసినట్లు యూత్ సభ్యులు తెలిపారు. అనంతరం మహిళలతో కుంకుమ పూజ జరిపించారు. యూత్ సభ్యులు రాకేశ్, శ్రీనివాస్, తిరుపతి, అన్వర్, నర్సయ్య, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: అయిలాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథునికి సర్పంచ్‌ల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సింగిల్‌విండో చైర్మన్ చింతకుంట సాయిరెడ్డి తదితరులు బుధవారం పూజలు చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

చేపలు పెంచి, లబ్ధి పొందాలి

ఇబ్రహీంపట్నం: మత్స్యకార్మికులు చేపలు పెంచి, లబ్ధి పొందాలని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో మత్స్యకార్మికులకు 36 కుంటలు, 9 చెరువుల్లో పెంచేందుకు 3.02 లక్షల చేప పిల్లలను పంపిణీ చేశారు. ఎంపీపీ జాజాల భీమేశ్వరి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు 'ఆసరా' గుర్తింపుకార్డుల పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంతోపాటు వర్షకొండ గ్రామంలో ఈ నెల 22న ఇబ్రహీంపట్నం మండలంలోని ఆసరా పెన్షన్‌దారులకు గుర్తింపు కార్డులను ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు చేతులమీదుగా పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ జాజాల భీమేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఇబ్రహీంపట్నం వేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఉదయం 11 గంటలకు ఇబ్రహీంపట్నం, అమ్మక్కపేట, కోజన్‌కొత్తూర్, కేశాపూర్ గ్రామాల వారికి, వర్షకొండ వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో వర్షకొండ, డబ్బా, కోమటికొండాపూర్, ఎర్దండి గ్రామాల వారికి కార్డులు ఇస్తామన్నారు. మండలానికి మొత్తం 472 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

ధర్మపురి: స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ ఆవాస డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాధాకిషన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఏ(ఈపీఎస్), బీకాం(సీఏ), బీఎస్సీ(ఎంపీసీఎస్), బీఎస్సీ (బీజెడ్‌సీ) కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్ పూర్తి చేసినవారు ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కళాశాలలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పని చేసేందుకు బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్‌ఎం అర్హత గల పురుషులు ఈ నెల 22 లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు

జగిత్యాల: ప్లాస్టిక్ కవర్లు విక్రయించినా, వాడినా చర్యలు తీసుకుంటామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో పలు షాపులను తనిఖీ చేసి, యజమానులకు జరిమానా విధించారు. ప్రతిఒక్కరూ జూట్ బ్యాగులు వినియోగించాలని, ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆయన వెంట సిబ్బంది రాము, అశోక్ ఉన్నారు.

ఆయిల్ పాం సాగుపై దృష్టిసారించాలి

రాయికల్: ఆయిల్ పాం సాగుపై రైతులు దృష్టిసారించాలని ఏవో ముక్తేశ్వర్ అన్నారు. బుధవారం రాయికల్ పట్టణంలోని గోనెకాపు సంఘం భవనంలో ఆయిల్ పాం సాగు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో మతాయి, రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

రాయికల్: పట్టణంలోని దానవేని మల్లయ్యకు చెందిన మేక బుధవారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. ప్రభుత్వం స్పందించి, పరిహారం అందించాలని బాధితుడు కోరాడు.

గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

రాయికల్: మూటపల్లి, వస్తాపూర్, కైరిగూడెం గ్రామాల్లో బుధవారం కొత్తగా 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు జగిత్యాల రూరల్ ఏడీఈ హరీశ్ తెలిపారు. వీటివల్ల విద్యుత్ లోవోల్టేజీ సమస్య తీరుతుందన్నారు. ఏఈ రాజేశం, సర్పంచ్‌లు తిరుపతి, సుమలత, రాజేందర్ తదితరులున్నారు.

దీర్ఘకాలిక రుణాల చెక్కులు పంపిణీ

మల్యాల: గొర్రెల యూనిట్ల కోసం దీర్ఘకాలిక రుణాల కింద లబ్ధిదారులకు రూ.34 లక్షల విలువైన చెక్కులను ప్యాక్స్ చైర్మన్ ముత్యాల రాంలింగారెడ్డి పంపిణీ చేశారు. బుధవారం మల్యాల పీఏసీఎస్ భవనంలో ముత్యంపేటకు చెందిన లింగారెడ్డికి రూ.20 లక్షలు, మల్యాలకు చెందిన లక్ష్మణ్‌కు రూ.6 లక్షలు, సర్వాపూర్‌కు చెందిన భూదమ్మకు రూ.8 లక్షల విలువైన చెక్కులు అందజేశారు. సింగిల్‌విండో సీఈవో గోవర్ధన్, సిబ్బంది తదితరులున్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

కోరుట్ల రూరల్: మండలంలోని మాదాపూర్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గార్బేజ్ ఫ్రీ ఇండియా అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్పంచ్‌ల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్ బహుమతి ప్రదానం చేశారు. జీపీ కార్యదర్శి, హెచ్‌ఎం, టీచర్లు ఉన్నారు.

నిత్యావసరాలు అందజేత

ఇబ్రహీంపట్నం: అమ్మక్కపేటలో దివ్యాంగురాలు, నిరుపేద చిట్యాల కళ కుటుంబానికి ఇబ్రహీంపట్నం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం 25 కిలోల బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. క్లబ్ కార్యదర్శి రాజశేకర్, సభ్యులు పాల్గొన్నారు.

విద్యారత్న పురస్కారం..

కోరుట్ల: పట్టణానికి చెందిన ప్రగతి హైస్కూల్ కరస్పాండెంట్ తంగళ్లపల్లి ధనలక్ష్మికి హైదరాబాద్‌కు చెందిన తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో బుధవారం విద్యారత్న పురస్కారం అందజేశారు. ఆమెను ప్రిన్సిపాల్ దీపక్, అడ్వకేట్ రాజేంద్రప్రసాద్ తదితరులు అభినందించారు.

23న హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించాలి

జగిత్యాలటౌన్: ఈ నెల 23న ప్రతీ గణేశ్ మండపం వద్ద హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించాలని గణేశ్ ఉత్సవ సమితి ఆర్గనైజింగ్ కార్యదర్శి ముదుగంటి రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండపాల నిర్వహణ, నవరాత్రుల విధివిధానాలపై విశ్వహిందూ పరిషత్ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం కరపత్రం ఆవిష్కరించారు.

పోషకాహారంతో తీసుకోవాలి

మల్యాల: గర్భిణులు, చిన్నారులు పోషకా హారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ అన్నారు. మద్దుట్లలో బుధవారం పోషణ మాసం నిర్వహించారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. సర్పంచ్ మల్లమ్మ, పాక్స్ చైర్మన్ మధుసూదన్‌రావు, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

'ఉద్యోగ భద్రత కల్పించండి'

ధర్మపురి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేస్తు న్న సమ్మె బుధవారం పదోరోజుకు చేరింది. ధర్మపురి మండల అంగన్‌వాడీలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె కొనసాగిస్తున్నారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనం, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా

• మల్లాపూర్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మల్లాపూర్: కోరుట్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశా.. ఆ సంతృప్తి తనకు ఉందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. బుధవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కాటిపెల్లి సరోజన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై, మాట్లాడారు. 21 ఏళ్ల అధికారంలో ఉండి, స్వపక్ష, విపక్షాలనే తేడా చూపకుండా అందరికీ పని చేశానన్నారు. సీఎం కేసీఆర్ అన్నివర్గాలకు సమప్రాధాన్యతనిస్తూ రాష్ట్రాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మల్లాపూర్ శివారులోని సోమేశ్వర కొండ ఘాట్‌రోడ్డు పనులను వచ్చే నెలలో ప్రారంభించి, శివరాత్రిలోగా పూర్తి చేస్తామన్నారు. వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్ మాట్లాడుతూ.. ముత్యంపేట శివారులోని గోధూర్ రోడ్డులో ఎస్సారెస్పీ డీ–29 ఉపకాలువ కల్వర్టుకు మరమతు చేయాలని, స్థానిక పెద్దచెరువు తూము నిర్మాణం చేపట్టాలని కోరారు. రేగుంట–వేంపల్లి మెటల్ రోడ్డు పనులు ప్రారంభించాలని రేగుంట ఎంపీటీసీ సభ్యుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమతు చేయడంతోపాటు రేగుంట శివారులోని బ్రిడ్జిపైన సైడ్‌వాల్ నిర్మించాలని, రుణమాఫీ సంపూర్ణంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. గుండంపల్లికి మిషన్ భగీరథ నీరు రావడం లేదని ఎంపీటీసీ మామిడి మంజుల ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. హుస్సేన్‌నగర్‌లో రోడ్డుపై గుంతలను పూడ్చాలని సర్పంచ్ సయ్యద్ హైదర్ కోరారు. ఎంపీడీవో జగదీశ్, ప్యాక్స్ చైర్మన్లు నర్సారెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నా కుమారుడిని గెలిపించండి'

• ఇబ్రహీంపట్నం సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

ఇబ్రహీంపట్నం: 'నన్ను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు.. మీ అందరికీ రుణపడి ఉన్న.. వచ్చే ఎన్నికల్లో నా కుమారుడు సంజయ్‌ని గెలిపించండి' అని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కోరారు. బుధవా రం ఎంపీపీ జాజాల భీమేశ్వరి అధ్యక్షతన ఇబ్రహీంపట్నం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించా రు. ఆయన మాట్లాడుతూ.. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. కోమటికొండాపూర్‌లో పంచాయతీ భవన నిర్మాణం పూర్తి చేస్తే పంచాయతీరాజ్ ఏఈ బిల్లులు రికార్డు చేయడం లేదని సర్పంచ్ శ్రీనివాస్ అన్నారు. సర్పంచ్‌లందరినీ సతాయిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, ఇబ్బంది పెట్టొద్దని కొత్తగా వచ్చిన పంచాయతీరాజ్ ఏఈ అరుణకు ఎమ్మెల్యే సూచించారు. పనులు చేసిన వెంటనే బిల్లులు పెట్టాలన్నారు. డబ్బా, వర్షకొండ గ్రామాల్లో గంటల తరబడి కరెంట్ పోయినా విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ సభ్యులు దేశెట్టి శాంత, పానకంటి వెంకట్ ఆరోపించారు. 3 నెలలుగా సర్వేయర్ లేక రైతులు భూ సర్వే కోసం ఇబ్బంది పడుతున్నారని మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి అన్నారు. సర్వేయర్‌ను అందుబాటులో ఉంచుతామని తహసీల్దార్ ప్రసాద్ పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, ఎంపీడీవో ప్రభు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఆర్.ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

• రాయికల్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి



మాట్లాడుతున్న ఎంపీపీ సంధ్యారాణి

రాయికల్: వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతాయని ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి అన్నారు. బుధవారం రాయికల్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నూతన రేషన్‌కార్డులు మంజూరు చేయాలని తాట్లవాయి సర్పంచ్ రాగి సాగరిక, భూపతిపూర్ సర్పంచ్ చంద్రశేఖర్ కోరారు. ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక అందించామని డిప్యూటీ తహసీల్దార్ సుమన్ తెలిపారు. రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సిబ్బంది లేక రోగులు ఇబ్బంది పడుతున్నారని మూటపల్లి సర్పంచ్ బెక్కం తిరుపతి అన్నారు. వైద్యాధికారి సురేశ్ మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, త్వరలోనే ప్రభుత్వం భర్తీ చేస్తుందని పేర్కొన్నారు. కొత్తపేట అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా కలప రవాణా అవుతోందని కొత్తపేట సర్పంచ్ రాజేశం అన్నారు. కలప అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ రేంజర్ చంద్రమౌళి తెలిపారు. రామారావుపల్లిలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయని, కొత్తవి మంజూరు చేయాలని పలుమార్లు ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ తిరుమల్ తెలిపారు. త్వరలోనే వేయిస్తామని ట్రాన్స్‌కో ఏఈ అర్జున్ పేర్కొన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ రాణి, ఎంపీడీవో సంతోష్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించండి

• సారంగాపూర్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు




మాట్లాడుతున్న ఎంపీపీ జమున

సారంగాపూర్: మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ కోల జమున అధ్యక్షతన నిర్వహించారు. వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్ మాట్లాడుతూ.. అర్పపల్లి జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులు 15 రోజులు సెలవులో ఉండటంతో విద్యార్థులు చదువుల్లో వెనకబడిపోతున్నారని అన్నారు. సారంగాపూర్ విండో చైర్మన్ ఏలేటి నర్సింహ్మారెడ్డి, రేచపల్లి ఎంపీటీసీ సభ్యురాలు భూక్య లావణ్యరాథోడ్ మాట్లాడుతూ.. యూరియా కొరత కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. సమావేశానికి పలు శాఖల ఏఈలు గైర్హాజరవడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో విషజ్వరాలు నియంత్రణకు వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. కోనాపూర్ వంతెన నిర్మాణ పనులు పూర్తికాకపోవడం, అప్రోచ్ రోడ్డు తరచూ కొట్టుకుపోతుండడంతో రవాణాకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు సమ్మెలో ఉండి, కేంద్రాల తాళాలను అప్పగించకపోతే మీరేం చేస్తున్నారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లత, శైలజలను ఎంపీడీవో రాజేందర్ ప్రశ్నించారు. తమకు సమాచారం ఇస్తే పోలీసుల సహకారంతో తెరిచేవారం కదా అనడంతో ఇప్పటికే ఫిర్యాదు చేసినట్లు సూపర్‌వైజర్లు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు మేడిపల్లి మనోహర్‌రెడ్డి, తహసీల్దార్ తఫాజుల్లా హుస్సేన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే మళ్లీ సమ్మె

• పంచాయతీ కార్మికులు



సారంగాపూర్: సమస్యలు పరిష్కరించకుంటే మళ్లీ సమ్మె బాట పడతామని పంచాయతీ కార్మికులు హెచ్చరించారు. బుధవారం సారంగాపూర్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఎంపీవో శశికుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న సిబ్బందికి మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 34 రోజులపాటు నిరవధిక సమ్మె చేస్తే మంత్రి దయాకర్‌రావు సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి, చావు ఖర్చులు, బీమా సౌకర్యం కల్పించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు.

పాఠశాలకు స్పోర్ట్స్ కిట్స్

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ హైస్కూల్‌కు రూ.25 వేల విలువైన స్పోర్ట్స్ కిట్స్‌ను స్థానిక శ్రీకృష్ణ ఫౌండేషన్ వారు బుధవారం అందజేశారు. అజయ్, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న హనుమాన్ ఆలయ పైకప్పు



పెచ్చులూడిన దృశ్యం

పెగడపల్లి: మండల కేంద్రంలోని పాత వాడకట్టు హనుమాన్ ఆలయాన్ని పునఃనిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఆలయంలో పూజలు చేస్తే కోరుకున్న కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. మరమ్మతుకు నోచుకోక శిథిలావస్థకు చేరి, పైకప్పు పెచ్చులూడుతోందని అంటున్నారు. భయంభయంగా పూజలు చేస్తున్నామని, స్థానిక ప్రజాప్రతినిధులు, దాతలు ముందుకు వచ్చి ఆలయ పునఃనిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.